క్లుప్తంగా

20 కిలోల గంజాయి స్వాధీనం

ఆరిలోవ: వ్యానులో గంజాయి తరలిస్తున్న కొందర్ని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జోడుగుళ్లపాలెం వద్ద సోమవారం ఆరిలోవ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఒడిశాకు చెందిన ఓ వ్యానులో కొందరు వ్యక్తులు కైలాసగిరి కొండపైకి వెళ్లి తిరిగి కిందకు వచ్చారు. తనిఖీలలో భాగంగా ఆరిలోవ పోలీసులు జోడుగుళ్లపాలెం వద్ద ఆ వ్యానును పరిశీలించారు. వ్యానులో చిన్న మూటలో సుమారు అర కిలో గంజాయి కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు కారు డిక్కీతో పాటు లోపల పూర్తిగా తనిఖీ చేయడంతో సుమారు మరో 20 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వ్యానులో ఉన్నవారిలో ఇద్దరు వ్యక్తులు పరారు కాగా, మరో ఇద్దరు పోలీసులకు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకొన్నారు. మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై దర్యాప్తు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆరిలోవ ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్ పరిధి హనుమంతవాక ఫీడర్‌లో మరమ్మతు పనులు జరగనున్నట్లు పేర్కొన్నారు. చినగదిలి, పెదగదిలి, దీన్‌దయాల్ పురం, వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం, ఎస్సీ కాలనీ, సాలిపేట, తదతర ప్రాంతాలలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జనవరిలో స్వర్ణకారులకు ముద్ర రుణాలు



ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌ను కలిసిన స్వర్ణకార సంఘం నాయకులు

బీచ్ రోడ్డు: కొత్త ఏడాదిలో మరింత మంది స్వర్ణకారులకు ముద్ర రుణాలు అందించేందుకు మరో 50 బ్రాంచిలలో పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకట రమణారావు తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్, ఇతర నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ ద్వారా రెండు విడతల్లో స్వర్ణకారులకు ముద్ర రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి, స్వర్ణకారులు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు మదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, కోశాధికారి ఈర్ని ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



బాక్సింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయ

దాబాగార్డెన్స్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. బాక్సింగ్ కేటగిరీలో అండర్-17 విభాగంలో సభతబుషం బంగారు పతకం, అండర్-19 విభాగంలో కె.నిహారిక బంగారు పతకం, ఎన్.దేవి చిరంజీవిత వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ అభినందించారు. జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం నుంచి తమ కళాశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివలక్ష్మి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు సొబగులు

నాడు



నాచు పట్టి అధ్వానంగా ఉన్న బ్లాక్

నేడు



అభివృద్ధి చేసిన బ్లాక్



విద్యార్థుల కోసం గదుల్లో ఏర్పాటు చేసిన మంచం



మహారాణిపేట హాస్టల్ భవనాలు

- ఏయూ మహిళా వసతి గృహాల ఆధునికీకరణ
- భవనాల పటిష్టతకు చర్యలు
- అధునాతన టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణం
- నాడు-నేడు పథకం స్ఫూర్తితో అభివృద్ధి





ఆధునికీకరించిన భవనం



నూతనంగా నిర్మించిన టాయిలెట్స్

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పథకం స్ఫూర్తిగా తీసుకుని ఏయూలో విద్యార్థుల హాస్టళ్లకు ఆధునిక సొబగులు అద్దుతున్నారు. ప్రధానంగా ఏళ్ల తరబడి మార్పునకు నోచని టాయిలెట్ బ్లాక్స్‌ని పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తున్నారు. స్వాతంత్ర్య సమర యోధురాలు దుర్గాబాయి దేశముఖ్ ప్రారంభించిన ఈ చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన హాస్టల్ భవనాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. దశలవారీగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఒక్కో భవనాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. మహారాణిపేటలోని ఏయూ విద్యార్థినుల హాస్టల్‌తో పాటు పలు వసతిగృహాలను నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఆధునికీకరించారు. హాస్టల్‌లో రెండు బ్లాక్‌లను దాదాపు రూ.60 లక్షలు వెచ్చించి మరమ్మతులు పూర్తి చేశారు. మెస్, న్యూ బ్లాక్‌లో వసతులు కల్పించారు.

రూ.35 లక్షలతో ఎల్‌బీ బ్లాక్

దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని ఎల్‌బీ(లేటెస్ట్ బ్లాక్) బ్లాక్‌ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ముందుగా మూడు అంతస్తుల్లో ఉన్న మరుగుదొడ్లను మార్పు చేశారు. టైల్స్ వేసి నూతనంగా టాయిలెట్స్ బ్లాక్‌లను నిర్మించారు. భవనంలో పూర్తిస్థాయిలో నీటి సరఫరా, వ్యర్థ జలాలు వెళ్లే పైపులను మార్పు చేశారు. భవనం మొత్తం వైట్‌వాష్ చేయించారు. గదుల తలుపులు బాగు చేశారు.

రూ.25 లక్షలతో సీబీ ఆధునికీకరణ

సెంట్రల్ బ్లాక్(సీబీ)ని దాదాపు రూ.25 లక్షల వ్యయంతో ఆధునికీకరించారు. దీనిలో మూడు అంతస్తుల్లో టాయిలెట్స్‌ని మార్పుచేసి టైల్స్‌తో కూడిన నూతన వాష్‌రూమ్ బ్లాక్‌ని నిర్మించారు. కమోడ్‌లు పూర్తిగా మార్పు చేశారు. వాటర్ సరఫరా వ్యవస్థ పైపులను మార్చారు. భవనం పైఅంతస్తులో నీటి నిల్వకు ట్యాంకులను ఏర్పాటు చేశారు. సెంట్రల్ బ్లాక్‌లో శిథిలావస్థకు చేరిన బాల్కనీలు, సన్‌షేడ్‌లకు మరమ్మతులు చేపట్టారు. శానిటరీ లైన్‌ను బాగు చేశారు. ప్యాచ్ వర్క్‌లు, ఎనామిల్ పెయింట్స్, వైట్‌వాష్ చేశారు. జి-1 మెస్‌లో ప్యాచ్ వర్క్‌లు, సీలింగ్‌లు, వైట్ సిమెంట్ వేయడం, కిచెన్‌లో అవసరమైన మరమ్మతులు చేపట్టారు. ఇందుకు సుమారు రూ.13 లక్షలు వెచ్చించారు.

విద్యార్థులకు ఉపయుక్తంగా..



విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రతి హాస్టల్ భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. విద్యార్థుల అవసరాలను ముందుగానే గుర్తించి, వారు హాస్టల్‌కు వచ్చే సమయానికి ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేశారు. వర్సిటీ హాస్టల్స్‌లో వసతులపై విద్యార్థులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

– ఆచార్య ఎ.పల్లవి, చీఫ్ వార్డెన్

పూర్తి స్థాయిలో మార్పు చేశారు..



వర్సిటీ హాస్టళ్ల టాయిలెట్స్ బ్లాక్‌లను అభివృద్ధి చేశారు. అదే విధంగా దెబ్బతిన్న భవనాలకు మరమ్మతులు చేపట్టి, కొత్తదనం తీసుకొచ్చారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భవనాలను ఆధునికీకరించారు.

– ఎం.దీపిక, న్యాయ విద్యార్థిని

అవసరమైన మార్పులు



హాస్టల్ భవనాలకు అవసరమైన మరమ్మతులను కాలానుగుణంగా చేపడుతున్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి భవనానికి మరమ్మతులు చేపట్టి పటిష్టం చేస్తున్నారు.

– పూజిత, జర్నలిజం విద్యార్థిని

గదులు చాలా బాగున్నాయి..



హాస్టల్‌లో మాకు కేటాయించిన గదులు చాలా బాగున్నాయి. టాయిలెట్స్ బ్లాక్ పూర్తిగా మార్పు చేశారు. ప్రతి గదిలో విద్యార్థుల సంఖ్యకు సమానమైన బెడ్‌లను సమకూర్చారు. హాస్టల్ వసతి చాలా బాగుంది.

– ఎస్.కె.దిల్ కష్, ఎం.శ్రీశేయన, న్యాయ విద్యార్థులు

‘ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం’



శివాజీనగర్-2లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: నియోజకవర్గంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి శివాజీనగర్-1, 2, కనకమహాలక్ష్మీనగర్, శ్రీకాంత్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలలో పాదయాత్ర జరిగింది. కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎంపీ పాదయాత్ర చేస్తూ ఆయా కాలనీల్లో ఇంటింటికీ వెళ్లారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎక్కువగా వీధి దీపాలు వెలగకపోవడం, కుళాయిలు సకాలంలో రాకపోవడం, శుద్ధిచేసిన నీరు సరఫరా చేయకపోవడం, తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. వాటిని సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్థానిక నాయకుడు కెల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి దివ్యాంగుల గుర్తింపు శిబిరాలు



విజయలక్ష్మి, జోన్-3 కమిషనర్

సీతమ్మధార: తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో దివ్యాంగుల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సోమవారం జీవీఎంసీ జోన్-3 కమిషనర్ జె.విజయలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు పలు రకాల ఉపకరణాలను ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 20న రేసపువానిపాలెం స్వర్ణభారతి స్టేడియంలో, 23న లాసెన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమం దరి ఓంకార్ బధిరుల పాఠశాలలో, 24న లాసెన్స్ బే కాలనీ కామత్ హోటల్ దరి బీజేపీ కార్యాలయంలో శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 22న పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో శిబిరం జరుగుతుందన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరాలకు దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం, యూడీఐ కార్డు, ఫొటోలు తీసుకురావాలని కోరారు. దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలను అందిస్తామని జెడ్సీ విజయలక్ష్మి తెలిపారు.

అందరి సహకారంతో కాలుష్య నివారణ



విద్యుత్ ఆటోలో కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ చేపట్టిన ప్రతి సోమవారం ప్రజా రవాణాను వినియోగించాలనే కార్యక్రమాన్ని తాను, జీవీఎంసీ యంత్రాంగం క్రమం తప్పకుండా ఆచరిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు విద్యుత్ ఆటోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వారానికి ఒక రోజు ప్రతి సోమవారం సైకిల్ లేదా ప్రజా రవాణా ద్వారా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

ఏయూ సమాచారం..

విద్య, వైద్య రంగాల్లో మిషనరీల సేవలు



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: విద్య, వైద్య రంగాలలో క్రైస్తవ మిషనరీలు ఎనలేని సేవలు అందించాయని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. సోమవారం ఏయూ సెంటర్ ఫర్ స్టడీ ఆన్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘భారత దేశంలో క్రైస్తవ మిషనరీలు-సామాజిక చేరిక కోసం ఒక మార్గం’ సదస్సులో ఆయన మాట్లాడారు. మదర్‌థెరీసా వంటివారు స్థాపించిన సంస్థలు వృద్ధులు, అనాథలు, రోగులకు విశేష సేవలు అందించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించాయన్నారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ భారత దేశం అనేక మతాల ప్రజలకు స్థానం కల్పించిందన్నారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం దేశంలో హిందువులు 79, ముస్లింలు 14.2, క్రైస్తవులు 2.3, బౌద్ధులు 0.7, సిక్కులు 1.72, జైనులు 0.37 శాతం మంది ఉన్నారన్నారు. మైనారిటీల కోసం రాజ్యాంగం అనేక చట్టాలు, రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసిందన్నారు. పాస్టర్ రెవరెండ్ సుధీర్ కనపర్తి మాట్లాడుతూ క్రైస్తవం ప్రేమ, శాంతిని కోరుకుంటుందన్నారు. క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమ కార్యకర్త బందెల దైవ వర ప్రసాద్ మాట్లాడుతూ నాగాలాండ్‌లో అత్యధికంగా 87 శాతం మంది అత్యల్పంగా బిహార్‌లో 0.12 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 1.34 శాతం మంది క్రైస్తవులు ఉన్నారన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ఎస్.బాబా వలి, డాక్టర్ జి.శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో రెండో ప్రపంచ తెలుగు మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ఆచార్యులతో కలిసి ఆవిష్కరించారు. జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు రామమహేంద్రవరం గైట్ కళాశాల వేదికగా ఈ సభలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.సీతారత్నం, డాక్టర ఈశ్వరయ్య, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో ఏయూ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని రాష్ట్ర ప్రచార కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి కోరారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి



చినగదిలి సాయిబాబా ఆలయంలో సుబ్రహ్మణ్యం షష్టి పూజలు చేస్తున్న కార్పొరేటర్ రోహిణి, భక్తులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజ లు చేశారు. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులతో ఆలయ అర్చకుడు నగేష్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



ఎంవీపీ కాలనీలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూల విరాట్ శ్రీవల్లి, దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకవారాభిషేకం నిర్వహించారు. మండపారాధన, పంచామృతాభిషేకం శోభాయామానంగా జరిగాయి. ప్రత్యేక అలంకరణలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామిని ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సింహగిరిపై ధనుర్మాస పూజలు



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పగల్ పత్తు ఉత్సవాలు ఆరో రోజు సోమవారం విశేషంగా జరిగాయి. భక్తులు స్వామి నామస్మరణలో మునిగితేలారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో అధిష్టింపజేసి దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు.

కనకమహాలక్ష్మికి విశేష అర్చనలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజలు చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘స్పందన’కు 15 అర్జీలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.